రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-హిరమండలం : రోడ్డు ప్రమాదంలో ఓవ్యక్తి మృతి చెందిన సంఘటన గురు వారం ఉదయం జరిగింది. మండలం లోని కొండ రాగోలు గ్రామ సమీపంలో ఎబి రహదారిపై చోటుచేసుకుంది, పోలీసులు తెలియజేసిన వివరాలు ప్రకారం బామిని మండలం నులకజోడు గ్రామానికి చెందిన అధికారి అభిమాన్యు 59 వ్యక్తి పనులు నిమిత్తం తన ద్విచక్ర వాహనంపై హిరమండలం వైపుగా వేగంగా వెళ్తుండగా కొండ రాగోలు సమీపంలోని అలికం బత్తిలి ప్రధాన రహదారిపై ఉన్న వేగనిరోదకం పై ఒక్క సారిగా వాహనం ఎగరడంతో అభిమాన్యు అదుపుతప్పి క్రిందపడ్డాడు. తలకు తీవ్ర గాయాలై అక్కడకక్కడే మృతిచెందినట్లు ఎస్ఐ జి.నారాయణ స్వామి తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.

మార్చి 5 నాటికి రెండో విడత రీసర్వే పూర్తి : కలెక్టర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం : జిల్లాలో చేపడుతున్న రెండో విడత రీ సర్వే మార్చి 5 నాటికి పూర్తవుతుందని కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్ సిసిఎల్ఏకు వివరించారు. రెండో విడత రీసర్వేపై భూ పరిపాలన ప్రధాన కమిషనర్ జి.సాయిప్రసాద్ కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాల్లో రీసర్వే మరింత వేగవంతం కావాలని కలెక్టర్లను కోరారు. ప్రతి విడతలో డ్రాఫ్ట్ ఆర్.ఓ.ఆర్‌లు రికార్డ్ చేయాలన్నారు. ఫైనల్ ఆర్.ఓ.ఆర్‌లు రికార్డు చేసి ఆర్.డి.ఓ, తహశీల్దారు కార్యాలయాల్లో అందుబాటులో ఉంచాలని సూచించారు. రీ సర్వేపై గ్రామసభలు నిర్వహించి వీడియోను తీసి ఆర్.డి.ఓ కార్యాలయంలో ఉంచాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నాలుగు గ్రామాలు మినహా దాదాపు రెండవ విడత రీసర్వే పూర్తయిందన్నారు. రీసర్వేను సర్వే వేగవంతం చేసేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు చెప్పారు. రీ సర్వే కావలసిన నాలుగు గ్రామాలు వచ్చే నెల 5 నాటికి పూర్తిచేస్తామని తెలిపారు. ఈ వీడియో సమావేశంలో భూ సర్వే మరియు రికార్డుల శాఖ సహాయ సంచాలకులు కె.ప్రభాకర రావు, డి-సెక్షన్ పర్యవేక్షకులు సూర్యనారాయణ, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిండు గర్భిణికి ఆశ్రయం కల్పించిన సీతయ్య ఫౌండేషన్

విశాలాంధ్ర-కవిటి : మండలం లోని పొడియా పుట్టుగ గ్రామానికి చెందిన అనాధ నిండు గర్భిణీనీ సీతయ్య ఫౌండేషన్ గురువారం ఆశ్రయం కల్పించింది. వివరాల్లోకి వెళితే పొడియాపుట్టుగ గ్రామానికి చెందిన నిండు గర్భిణి అయిన ఓ మహిళ తల్లిదండ్రులను అయిన వాళ్లను కోల్పోయి అనాధగా మిగిలింది. జీవనం సాగించటానికి నిలువ నీడ లేక నిండు గర్భిణీ అనాధగా మిగిలిపోయిన అభాగ్యురాలు సమాచారాన్ని గ్రామస్తులు, డాక్టర్ పూడి రామారావు, హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంధ సంస్థ సభ్యులు కాశీ సాహు ద్వారా తెలుసుకున్న సీతయ్య ఫౌండేషన్ స్వచ్ఛంధ సంస్థ మానవతో దృక్పధంతో ఆశ్రయం కల్పించి నిండు గర్భిణీ అక్కున చేర్చుకొని తన సేవలను అందించింది. గర్భిణీ అత్యవసర పరిస్థితిని అర్థం చేసుకుని ఏఎన్ఎం, ఆశా వర్కర్, అంగన్వాడి సలహాలు మేరకు వైద్య సహాయం అందించారు. సమాచారాన్ని అందజేసినవారికి సీతయ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు గుల్ల రమేష్, గుల్ల మోహనరావులు కృతజ్ఞతలు తెలియజేశారు.

బోర్వెల్‌కు వైస్ ఎంపీపీ భూమి పూజ

విశాలాంధ్ర-కొత్తూరు : నీటి ఎద్దడితో ఇబ్బందులు పడుతున్న మండలం మాకువరం గ్రామంలో స్థానిక ఎంపీటీసీ చీకటి వీర్రాజు అభివృద్ధి నిధులతో మంజూరైన మంచినీటి హేండ్ బోర్ వెల్ ఏర్పాటుకు వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసివర ప్రసాదరావు గురువారం భూమి పూజ నిర్వహించారు. తనకు కేటాయించిన నిధులను తాగు నీటి అవసరాలకు ఉపయోగించిన ఎంపీటీసీ వీర్రాజును ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ లోతుగెడ్డ అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గార భాస్కర్‌రావు, వైసీపీ నాయకులు పడాల వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దూర విద్యలో అడ్మిషన్లు

విశాలాంధ్ర-కాశీబుగ్గ : జూనియర్ కళాశాల ఇంటర్ చదివిన డ్రాపౌట్ విద్యార్థులకు ఎపిఓఎస్ఎస్ దూర విద్యా ద్వారా అడ్మిషన్లు నిర్వహించబడుతున్నామని పలాస జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బాడ వెంకటమోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసై ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ పొంది కళాశాలకు ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా కళాశాలకు హాజరు కాని వారు, కళాశాలలో చేరి మధ్యలో చదువు ఆపేసిన వారు, 60శాతం కంటే తక్కువ హాజరున్న విద్యార్థులు ఎపిఓఎస్ఎస్ దూర విద్య ద్వారా ఈ నెల 21 నుంచి 27వ తేదీ వరకు అడ్మిషన్లు పొందుటకు ఇంటర్మీడియట్ బోర్డు మరియు ఎపిఓఎస్ఎస్ దూర విద్య వారు సంయుక్తంగా అవకాశం కల్పించారన్నారు. ఈ అవకాశాన్ని డ్రాపౌట్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు కళాశాలను సంప్రదించాలని తెలిపారు.

ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కారం

ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సరస్వతి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: ఉద్యమాలు ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని, ప్రభుత్వం ఉపాధ్యాయులపట్ల అనుచరిస్తున్న నిర్లక్ష్య వైఖరిపట్ల పోరాటాలకు సిద్ధం కావాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దవళ సరస్వతి అన్నారు. గురువారం ఏపీటీఎఫ్ ఆద్వర్యంలో కోటబొమ్మాళి, జలుమూరు శాఖ ఉపాధ్యాయులు స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయం అవరణలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ తక్షణమే సీపీఎస్ రద్దు చేయాలని, పాత పింఛను విధానం పునరుద్ధరించాలని, 12వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే నియమించాలని, ఉపాధ్యాయులను భోధరేతర పనులు నుంచి తప్పించాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను మంజూరు చేయాలని, ప్రతీనెల 1వ తేదీన జీతాలు చెల్లించాలని, పని సర్దుబాటు పేరుతో జరిగిన అక్రమ డిప్యుటేషన్ రద్దు చేయాలని, ఉపాధ్యాయులకు బదిలీపై మాత్రమే వేరు చోటకు పంపించాలని, ఉన్నత పాఠశాలల్లో ఇంటర్ తరగతులకు లెక్చలర్ పోస్టులను మంజూరు చేయాలని, ఖాళీగా ఉన్న 50వేల ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని, ఎయిడెడ్ ఉపాధ్యాయులను హెత్త్ కార్డులను మంజూరు చేయాలని, విద్యార్థుల సమగ్ర వికాశానికి అనువైన ఖరిక్యులం రూపొందించాలని, గురుకుల పాఠశాలలోను, మోడల్, కస్తురిభా పాఠశాలలోను కాంట్రాక్ట్, అవుట్ సోర్సు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, కెజీబీవి, మోడల్ స్కూల్‌లో వార్డెన్, సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని లేకుంటే ఉద్యమాలను మరింత ఉద్యతం చేస్తామని అమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యాక్షుడు ఎల్. కరుణాకర్, బద్దేపల్లి నేతాజీరావు, మండల అధ్యక్ష కార్యదర్శిలు చల్ల కేశవరావు, హనుమంతు శివప్రసాద్, జీవి రమణమూర్తి, తదితరులు, ఉపాధ్యాయులు ఉన్నారు. అనంతరం స్థానిక తహసీల్దార్ జామి ఈశ్వరమ్మకు ఏపీటీఎఫ్ అద్వర్యంలో ఉపాధ్యాయుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు.

చిరస్మరనీయుడు ఎర్రన్నాయుడు

- ఎర్రన్న ఘాటు వద్ద అబ్బాయి, బాబాయ్‌లు
- ఘనంగా ఎర్రన్న జయంతి ఉత్సవాలు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: మాజీ కేంద్ర మంత్రి, దివంగత నేత కింజరాపు ఎర్రన్నాయుడు చిరస్మరనీయుడని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అద్యక్షుడు, టెక్కలి శాసనసభ్యుడు కింజరాపు అచ్చెన్నాయుడు, జిల్లా పార్లమెంటు సభ్యుడు కింజరాపు రామ్మోహన్‌నాయుడులు అన్నారు. గురువారం ఎర్రన్నాయుడు 66వ జయంతి కార్యక్రమాన్ని తమ స్వగ్రామం నిమ్మాడలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎర్రన్నాయుడు కాంశ విగ్రహానికి గజమాలలు వేశారు. అనంతరం ఎర్రన్నాయుడు ఘాటువద్ద ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి కుటుంబసభ్యులతో కలిసి నివాళు ర్పించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి గౌతు శివాజీ, పార్టీ మహిళ అధ్యక్షురాలు గౌతు శిరీష, మాజీ శాసనసభ్యులు గొండ లక్ష్మీదేవి, బగ్గు రమణమూర్తి, కలమట వెంకట రమణ, పీఎంజే బాబు, బగ్గు లక్ష్మణరావు, చౌదరి ధనలక్ష్మి, చౌదరి నారాయణమూర్తి, పీఏసీఎస్ మాజీ అద్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, నిమ్మాడ సర్పంచ్ కింజరాపు సురేష్, మాజీ ఎంపీపీ తర్ర రామక్రిష్ణ, మాజీ జెడ్పీటీసీ ప్రతినిధి నంభాళ్ల శ్రీనివాస్, మండలంలో మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు గొండు లక్ష్మణరావు, దేవాది సింహాద్రి, కోట బొమ్మాళి టీడీపీ సీనియర్ నాయకుడు బోయిన గోవిందరాజులు, పార్టీ అద్యక్షుడు బోయిన రమేష్, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఎర్రన్నాయుడు ఘాటు వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గృహ సారథులే దిశా నిర్దేశకులు : ఎమ్మెల్సీ దువ్వాడ

విశాలాంధ్ర సంతబొమ్మాళి : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఉన్నత ఆశయంతో ఏర్పాటుచేసిన గృహసారథిలే భవిష్యత్తు దిశా నిర్దేశికులని, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసరావు అన్నారు. గురువారం సంతబొమ్మాళి లో గృహసారథులు, వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, ఆరోగ్య సిబ్బందితో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం భారతదేశంలో పేరు ప్రఖ్యాతులు పొందిందని, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలన విధానాన్ని ఇతర రాష్ట్రాలు కొనియాడుతున్నారని అన్నారు. గృహ సార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని, ప్రస్తుతం ప్రజలకు ప్రభుత్వానికి వారదులుగా పనిచేయాల్సి ఉంటుందని అన్నారు. అనంతరం దువ్వాడ శ్రీనివాసును, ప్రజా పతినిధులు, వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి మెరుగు అప్పారావు, పిఎసిఎస్ అధ్యక్షులు కెళ్ళి జగన్నాయకులు (గోవిందరావు), మండల వైస్ ఎంపీపీ ప్రతినిధులు నక్క భీమారావు, పొందల రామకృష్ణ, మండల సచివాలయాల కన్వీనర్ల అధ్యక్షుడు మోడీ భాస్కర్ రెడ్డి, మండల వైకాపా పార్టీ కన్వీనర్ కోత సతీష్, సంతబొమ్మాళి సర్పంచ్ కళింగపట్నం లక్ష్మీ అప్పారావు, ఎంపీటీసీలు ధూబ లక్ష్మీ వేణుగోపాలరావు, సిమ్మ సోమేశ్వరరావు తో పాటు పలువురు ఎంపీటీసీ సర్పంచులు వైకాపా నాయకులు అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సజ్జలతో 'కోట' భేటీ

విశాలాంధ్ర-ఆమదాలవలస : ప్రభుత్వ ముఖ్య సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని అమరావతిలోని తన కార్యాలయంలో ఆముదాల వలస నియోజకవర్గ సీనియర్ వైసిపి నాయకులు కోట గోవిందరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోట గోవిందరావు సజ్జల రామకృష్ణారెడ్డితో ఆమదాలవలస నియోజకవర్గానికి సంబంధించిన పలు రాజకీయ సంబంధిత సమస్యలపై చర్చించినట్లు తెలిసింది. సజ్జల ఆముదాలవలస వైయస్సార్ పార్టీ బలోపేతానికి తమ వంతు కృషిచేయాలని కోట గోవిందరావుకు సజ్జల సూచించారు. సజ్జనని కలిసినవారిలో కోట జస్వంత్, పైడి జనార్దన్‌రావులు ఉన్నారు.

ఉపాధ్యాయ ఉద్యమ పోరును రుచి చూపించండి

ఏపిటిఎఫ్ సీనియర్ నేత దండా పిలుపు

విశాలాంధ్ర-పొందూరు : రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న దృశ్య ఉపాధ్యయ ఉద్యమ పోరును సర్కారికి రుచి చూపించే రోజులు ఆసన్నమైందని ఏపీటీఎఫ్ సీనియర్ నాయకులు దండా సూరిబాబు అన్నారు. ఏపీటీఎఫ్ నిర్వహిస్తున్న దశలవారీ ఉద్యమంలో భాగంగా గురువారం పాత తాలూకాకేంద్రంమైన పొందూరులో ధర్నా నిర్వహించారు. ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలోను ప్రభుత్వం చొరవ చూపకపోవడం దారుణమని సంఘ నాయకులుఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి తన అధికారి స్థాయికి తగిన పనులు చేయకుండా ఉపాధ్యాయులను వేధించడమే పనిగా పెట్టుకుని కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారని పలువురు అభిప్రాయపడ్డారు. ఉపాధ్యాయులపై ఉన్నతాధికారులే తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని విమర్శల వర్షం కురిపించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉద్యమ నేత ఎం. మదన్మోహన్. మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎం. రమణరావు, డి. శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె. విజయ్ కుమార్ సంఘ నాయకులు పి. తిరుమలరావు, రమేష్ బాబు, కె. వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్స్ స్థానానికి నామినేషన్ వేసిన 'దుప్పల'

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్ : ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్స్ ఎంఎల్సీ నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్‌గా దుప్పల రవీంద్రబాబు గురువారం విశాఖ కలెక్టరు కార్యాలయంలో రెండో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. బుధవారం తొలి సెట్ దాఖలు చేశారు. ఎయిలో చదువుకున్న సహచరులు తోడు రాగా, నిరాడంబరంగా ఆయన కలెక్టరు కార్యాలయానికి వచ్చారు. అనంతరం తనను కలసిన మీడియాతో మాటాడుతూ, చాలాకాలం బిజెపిలో పనిచేశానని, కొన్ని కారణాలవల్ల గత కొద్ది నెలల నుంచి, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నానని తెలిపారు. గ్రాడ్యుయేట్స్ స్థానం నుంచి ఎమ్మెల్సీ పదవి కోసం పోటీ చేయాలన్న సహచరులు, శ్రేయాభిలాషులు ఒత్తిడి చేసినట్టు తెలిపారు. అందుకు అంగీకరించిన తరువాత, బిజేపి ప్రాధమిక సభ్యత్వానికి రాజీనామా లేఖ పంపించినట్టు తెలిపారు. ఉత్తరాంధ్రను దీర్ఘ వ్యాధుల్లా పట్టిపీడిస్తున్న సమస్యలపట్ల తనకు పూర్తి అవగాహన వుందని, గెలిపిస్తే శాసనమండలిలో ప్రజల గొంతునవుతానని చెప్పారు.

పేదలకు వస్త్రాలు పంపిణీ

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్ : వాకర్స్ ఇంటర్నేషనల్, ఆదిత్యా వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకులు పోలు మహంతి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రముఖ విద్యావేత్త, ఆధ్యాత్మికవేత్త, శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ స్థాపకులు కీ.శే బగ్గాం ధర్మారావుగ వర్ధంతి సందర్భంగా గురువారం పాతశ్రీకాకుళం షిర్డీసాయి ఆలయప్రాంగణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో నిరుపేదలు, యాచకులు సుమారు 30 మందికి దుప్పట్లు, పంచెలు, చీరెలు, పండ్లు మరియు మిఠాయిలతో పాటు రూ.50లు చొప్పున నగదు ఆర్థికసహాయాన్ని ప్రముఖ ఫిజియోథెరపిస్టు డా. శ్రీనివాస్ పట్నాయక్ అందించారు. పేదల సేవా కార్యక్రమాలలో ఆదిత్యవాకర్స్ క్లబ్ ముందుంటుందని అధ్యక్షులు పోలుమహంతి ఉమామహేశ్వరరావు అన్నారు. అధ్యక్షులు బురిడి గౌరీశంకర్, వైయస్సార్ సిపి నాయకులు హరిబాబు, బుడుమూరు శ్రీనివాస రావు, యస్‌వి నారాయణ, గణేష్ స్వామి, డి.రాజగోపాల్‌నాయుడు, నానిబాబు, మన్మధరావు, తహశీల్దారు చందు, బి.కోటేశ్వరరావు, రఖో, కొండబాబు, యస్ యమ్ రావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం

విశాలాంధ్ర-హిరమండలం : మండలకేంద్రమైన హిరమండలం పెద్ద కోరాడకు సమిపం లోని ప్రేమ సాయి వృద్ధాశ్రమాన్ని శ్రీకాకుళం శ్రీ సత్య సాయి అన్నపూర్ణ సేవా సంఘం (రిమ్స్) అధ్యక్షులు గంగుల రమణ బాబు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమ వాసులను ఉద్దేశించి మాట్లాడుతూ వృద్ధాప్యములో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన తోనే ఉండాలని తద్వారా మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఆశ్రమం వాసులు నిరంతరము భగవాన్ నామ స్మరణ, తండులార్చన, లిఖిత నామ జపం, చేస్తూ జీవనాన్ని సాగించాలని ఆయన పేర్కొన్నారు. ఆశ్రమ వాసుల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమంలో జరుగుతున్న సేవలు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. సంస్థ పదాధిపతులు పడాల ప్రసాదరావు ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ఆశ్రమం అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ప్రతి ఒక్కరూ ప్రేమతోనే మెలగాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం సభ్యులు చంటి మాస్టారు, జోషుల గోవింద శర్మ, ఆశ్రమ మేనేజర్ కే జయరామ్ తదితరులు ఉన్నారు.

ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులుగా మురారి అప్పన్న

విశాలాంధ్ర-పాతపట్నం : వైఎస్ఆర్సీపీ అనుబంధ విభాగం ఎస్టీ సెల్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులుగా పాతపట్నం మండలం కోదూరు పంచాయతీలోని కోదూరు గ్రామానికి చెందిన లిగురాడి అప్పన్న నియమితులయ్యారు. ఈ శుభ సందర్భంగా పాతపట్నం నియోజకవర్గ కేంద్రంలోని శాసనసభ్యురాలు రెడ్డి శాంతి క్యాంపు కార్యాలయం లో రెడ్డి శాంతి ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అప్పన్నకి హృదయ పూర్వక అభినందనలు తెలియజేసి, వైఎస్ఆర్సీపీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో 'కూన'

విశాలాంధ్ర-సరుబుజ్జిలి : మండలంలోని బప్పడాం పంచాయతీలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా పార్లమెంటరీ అధ్యక్షులు కూన రవికుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రం చాలా ప్రమాదకరమైన పరిస్థితిలో ఉందని, ఈ సమయంలో అనుభవం కలిగిన ముఖ్యమంత్రి అవసరముందని అన్నారు. అప్పుల ఊబిలో వున్న రాష్ట్రాన్ని ఒక్క చంద్రబాబు మాత్రమే కాపాడగలరన్నారు. కార్యక్రమంలో పంచాయతీలో ప్రతి గడపను పలకిరించారు. పంచాయతీలోగల బొప్పడం, అమృతలింగనగరంలో విశేష స్పందన లభించింది. ప్రజలు తమ కష్టాలను తెలియచేసారు. గత కొన్ని దశాబ్దాలుగా వివిధ పార్టీలు అధికారంలోకి వచ్చాయని, కానీ ఎప్పుడూ ఇలాంటి దౌర్భగ్య పాలన చూడలేదని అన్నారు. గ్రామస్తులంతా కార్యక్రమంలో పాల్గొని జై టీడీపీ అంటూ నినాదాలు చేసారు. గ్రామస్తులు పాఠశాల భవనం పూర్తిగా పాడైందని, నాయుకులు ఎవరూ పట్టించుకోవటంలేదన్నారు. అనంతరం రవికుమార్ విద్యారులతో ముచ్చటించారు, విద్యార్థులు నిస్పృహ చెందవద్దని బాబు వస్తే జాబ్ తప్పకుండ వస్తుందని అన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ పార్టీ కార్యదర్శి శివ్వాలా సూర్యం, అంబాలి రాంబాబు, కింజరాపు సురేష్, పేడాడ రమణ, ఏచ్చర్ల తవిటినాయుడు, పల్లి సురేష్, ధవళ సింహాచలం, కూటికుప్పల కోటేశ్వర రావు, కొర్ను సూర్యనారాయణ, గురువు తిరుమలరావు మరియు ఇతర నాయుకులు టీడీపీ కార్యకర్తులు పాల్గొన్నారు.

25న ప్రత్యేక వైద్య శిబిరం

- కిడ్నీ భూతాన్ని తరిమికొట్టాలి
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : ఉద్దానం ప్రాంతాన్ని ఎన్నో ఏళ్ళుగా పట్టిపీడిస్తున్న కిడ్నీ భూతాన్ని తరిమికొట్టేందుకు ప్రభుత్వాలతో పాటు సామాజిక, స్వచ్ఛంద సంస్థలు కలిసికట్టుగా ముందుకు రావాలని శ్రీకాకుళం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా పిలుపు నిచ్చారు. గురువారం జిల్లా జడ్జి ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్దానం ప్రాంత ప్రజలు అందరూ విధిగా వైద్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. ప్రాథమిక స్థాయిలోనే కిడ్నీవ్యాధిని గుర్తిస్తే కొంతవరకు మరణాల రేటు నివారించేందుకు అవకాశం ఉంటుందన్నారు. సామాజిక, మానవతా దృక్పథంతో శ్రీకాకుళం జిల్లా న్యాయ వ్యవస్థ అంతా కలిసికట్టుగా ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలకు పెద్దఎత్తున అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఇంతవరకు జిల్లా న్యాయ స్థానం ఆధ్వర్యంలో 3 మండలాల్లో 3 వైద్య శిబిరాలు, మూడు న్యాయ విజ్ఞాన సదస్సులు ఏర్పాటు చేశామని, తద్వారా మూత్రపిండాల వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు ఉద్దానం ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. మానవతావాదులంతా ముందుకు వచ్చి ఉద్దానానికి పూర్వవైభవం వచ్చే విధంగా కృషి చేయాలని ఆయన కోరారు. ఉద్దానం ప్రాంతంలో ఉన్న వారంతా విధిగా వైద్య పరీక్షలు చేసుకోవాలని, కిడ్నీ వ్యాధి సోకిన వ్యాధిగ్రస్తులు అందరూ వైద్యులు సూచించిన మందులు విధిగా వాడాలని ఆయన సూచించారు. ఈ నెల 25న సోంపేట మండలం బట్టిగల్లూరు, హరిపురం గ్రామాల్లో వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ రెండు గ్రామాలే కాకుండా పరిసర ప్రాంతాల ప్రజలు వచ్చి పరీక్షలు చేయించుకోవచ్చన్నారు. వైద్య పరీక్షలే కాకుండా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

మార్చి 18న ప్రత్యేక లోక్ అదాలత్... మార్చి 18న మెగా లోక్ అదాలత్ ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా చెప్పారు. ఇందులో కుటుంబ సమస్యలు ఏమైనా ఉంటే వాటిని పరిష్కరించుకోవాలని తెలిపారు. భార్యభర్తలు తమ సమస్యలు పరిష్కరించుకొని కుటుంబంతో సంతోషంగా జీవితాన్ని కొనసాగించాలన్నారు. ఇందుకు న్యాయవాదులు, కక్షిదారులు సహకరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి, డిఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసి నాయుడు పాల్గొన్నారు.

విప్రో సంస్థకు 18 మంది కాకినాడ శ్రీ ఆదిత్య విద్యార్థులు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : విప్రో సంస్థ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో తమ కళాశాల విద్యార్థులు 18 మంది ఉద్యోగాలకు ఎంపికయినట్లు కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కో-ఎడ్యుకేషన్ కళాశాలల ప్రిన్సిపాల్ ఎస్.వి.వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులకు అత్యున్నత కంపెనీల క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించగా 250 మంది విద్యార్థులు తమ కళాశాలల నుంచి ఎంపికయ్యారని తెలిపారు. తమ కళాశాలల్లో డిగ్రీ మొదటి సంవత్సరం నుంచే ఇంటర్వ్యూలకు శిక్షణ ఇస్తున్నామన్నారు. విప్రో కంపెనీలో ఎంపికయిన అభ్యర్థులు సంవత్సరానికి 2.5లక్షలప్యాకేజితో పాటు ప్రముఖ సంస్థ బిట్స్ పిలాని నుంచి ఎంటెక్ చేసే అవకాశాలు కూడా కంపెనీ వారు అందిస్తున్నారని తెలిపారు. అనంతరం క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఎంపికయిన విద్యార్థులను కళాశాల అకడమిక్ డైరక్టర్ బీఈవిఎల్ నాయుడు, కళాశాలల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ సుగుణ రెడ్డి డైరక్టర్ చక్రవర్తి అభినందంచారు.

స్వతంత్ర అభ్యర్థిగా ఆనెపు

విశాలాంధ్ర-బూర్జ : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థిగా ఆనెపు రామకృష్ణం నాయ్డు గురువారం నామినేషన్ దాఖలు చేశారు. జెడ్పీటీసీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా, జాతీయ మానవ హక్కుల సంఘం ఉపాధ్యక్షుడుగా, ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షుడుగా రాష్ట్ర స్థాయిలో ఎన్నో కీలక పదవులను అలంకరించి అహర్నిశలూ సమాజ సేవకు తోడ్పడుతూ రాజకీయాలలో తనదైన ముద్ర వేసుకున్న ఆనెపు రామకృష్ణకు ఆంధ్రప్రదేశ్ తూర్పు కాపు సంక్షేమ సంఘం బలపరిచింది. ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ నామినేషన్ వేసిన సమయంలో తోడుగా నిలిచి బలపరిచారు. ఇప్పటికే ఎమ్మెల్సీ స్థానాన్ని తూర్పు కాపులకు కేటాయించాలని డిమాండ్ చేసిన చంద్రమోహన్ టిక్కెట్టు కేటాయించక పోవటంతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న రామకృష్ణ కు మద్దతు పలికారు.

జాబ్ కార్డ్ ఉన్నవారందరికీ ఉపాధి కల్పించాల్సిందే : డ్వామా పీడీ

విశాలాంధ్ర-ఆమదాలవలస : జాబ్ కార్డ్ ఉన్న కుటుంబాల వారందరికీ ఉపాధి హామీ పథకం పనుల వద్ద ఉపాధిని చూపించాల్సిందేనని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జీవి చిట్టి రాజు సిబ్బందికి స్పష్టం చేశారు. గురువారం చిట్టివలస పంచా యతీ పరిధిలో అమృత్ సరోవర్ చెరువు పను లను పిడి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ కూలీలతో రెండు పూటలా పను లు చేయించాలని, సగటు వేతనం రూ. 250 తగ్గకుండా ఉండాలని పేర్కొన్నారు. వంద రోజులు పని దినాలు కల్పనపై ప్రధానంగా దృష్టి సారించా లన్నారు. ఉన్నతాధికారులు నిర్దేశించిన లక్ష్యాల మేరకు అన్ని పంచాయి తీల్లోనూ పనులు జర గాలని, ప్రతి పంచాయతీలో కనీసం 200 మంది కూలీలు తగ్గకుండా పనులు కల్పించాలని ఆదేశించారు. అమృత సరోవర్ పేరున చెరువుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని అందుకు తగ్గట్టుగా పనులు జరిపించాల్సిన అవసరం ఉందని ఎంపీడీవో ఎం రేణుక అన్నారు. మండలంలో కత్యాచార్యులపేట, నెల్లిపర్తి, జక్కన్న చెరువు ఆర్ఎస్ లక్షల వంతున మంజూరయ్యాయని అత్యంత అందమైన విధంగా చెరువును తీర్చిదిద్దాలని ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. లక్ష్యాల సాధనలో వెనుకబడిన సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల స్థాయిలో సిబ్బంది అందరూ సమ న్వయంతో విధులు నిర్వ హించాలని సూచించా రు. ఈ పర్యటనలో పీడీ వెంట ఏపిఓ అప్పల నరసమ్మ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాదులు విధులు బహిష్కరణ



విశాలాంధ్ర-ఆమదాలవలస : ఆమదాలవలస కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కణితి విజయలక్ష్మి ఆధ్వర్యంలో బుధ వారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. రంగారెడ్డి జిల్లాలో న్యాయవాదిపై జరిగిన దాడికి నిరసనగా విధులను బహిష్కరించారు. నారపాటి సురేంద్రపై ప్రత్యర్థులు దాడి చేయడానికి ఖండించారు. న్యాయవాదులపైన జరుగుతున్న దాడులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బార్ కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం చేశారు. కోర్టు ఆవరణలో న్యాయవాదిపై దాడికి నిరసనగా నినాదాలు చేశారు. తమ్మినేని అన్నమ నాయుడు, పైడి వరహా నరసింహులు, వెంక టరమణ, కె.వి రమణ, బురెల్లి సీతారాం తదితర న్యాయవాదులు నిరసన తెలిపిన వారిలో ఉన్నారు.

నేడు ద్విచక్ర వాహనాల వేలం

విశాలాంధ్ర-కంచిలి : స్థానిక కంచిలి పోలీస్ స్టేషన్ వద్ద శుక్రవారం ఉదయం 11 గంటలకు మూడు ద్విచక్ర వాహనాల వేలం నిర్వహించనున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి గల వారు వెయ్యి రూపాయలు డిపాజిట్ చెల్లించి, తమ ఆధార్ కార్డుతో సహా వేలంపాటలో పాల్గొనవచ్చు అని తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ టవర్ మంజూరుపై హర్షం

విశాలాంధ్ర-కంచిలి : మండలంలోని పెద్ద శ్రీరాంపురం గ్రామంలో బిఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటు చేసేందుకు అనుమతులు మంజూరైనట్లు ఎంపిటిసి మాదిన విమల, మాజీ సర్పంచ్ మాదిన రామారావ్ తెలిపారు. ఈ మేరకు గురువారం విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో సెల్ సిగ్నల్స్ లేక గ్రామస్తుల ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఎంపీ రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అశోక్‌ల దృష్టికి తీసుకువచ్చామన్నారు. వారి కృషి మేరకు ఐటిడిఏ ఆధ్వర్యంలో గ్రామంలో సెల్ టవర్ నిర్మించేందుకు అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందుకు కృషి చేసిన ఎంపీ రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అశోక్ లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

బేడా బుడగ జంగం సంఘం సమస్యలు పరిష్కరించాలి : మంత్రికి వినతి

విశాలాంధ్ర-పలాస : శ్రీకాకుళం జిల్లా పరిధిలో గల బేడాబుడగ జంగం సంఘం సమస్యలు పరిష్కారించాలని గురువారం రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు ఆ సంఘం సభ్యులు వినతిపత్రం అందజేశారు. బేడాబుడగ జంగం కులంనకు ఎస్సీ కుల దృవీకరణ పత్రాలు మంజూరు చేయడంలో సమస్యలను గూర్చి ప్రభుత్వానికి తెలియజేయాలని వినతిపత్రంలో కోరారు. మంత్రికి వినతిపత్రం అందజేసిన వారిలో గోపి, శిష్ణు, ఆ సంఘం సభ్యులు ఉన్నారు.

మహిళలకు తల్లిదండ్రులే సం'రక్షకులు'

విశాలాంధ్ర-పలాస : మహిళల భద్రతపై వారి తల్లిదండ్రులే మొదట సంరక్షకులని, తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా చక్కగా చదువుకొని ముందుకు సాగాలని కాశీబుగ్గ పోలీసు బృందం అన్నారు. గురువారం పలాస జూనియర్ కళాశాలలో మహిళల భద్రతపై వారు అవగాహన కలిగించారు. ఆకతాయిలు ఇబ్బందులకు గురి చేస్తే తల్లిదండ్రులకు, అధ్యాపకులకు, పోలీసుల వారికి వెంటనే తెలియజేయాలని అన్నారు. కార్యక్రమంలో పోలీసు బృందం సభ్యులు బి.అనూష్, టి.కుసుమలత, ఇ.ఈశ్వరి, ఎం.కుమారి, కె.జీవరత్నం, వి.రవి, సత్తిరాజు, జంగమయ్య, మురళీ, కళాశాల ప్రిన్సిపాల్ బాడ వెంకటమోహన్, ఎన్ఎస్ఎస్ అధికారులు కొండల మధుబాబు, తమ్మినేని వాసుదేవరావు, తమ్మినాన పాపారావులు పాల్గొన్నారు.

మేఘవరంలో అచ్చంనాయుడుని కలిసిన టీడీపీ కార్యకర్తలు



విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం మేఘవరం గ్రామానికి ఓ ప్రైవేటు కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, టెక్కలి నియోజకవర్గం ఎమ్మెల్యే కింజరాపు అచ్చం నాయుడు ను, మండలంలో కల ముఖ్యమైన తెలుగుదేశం నాయకులతో పాటు, మేఘవరం,, మరువాడ పంచాయతీలతోపాటు, తీరప్రాంత గ్రామాలకు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు కలిశారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు వారి క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో, పార్లమెంటరీ పార్టీ కార్యదర్శి నౌపడ సత్యనారాయణ, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జీరు భీమారావు, మరువాడ పంచాయతీ సర్పంచ్ ప్రతినిధి, విద్యా కమిటీ చైర్మన్ సూరాడ దాసురాజు, మేఘవరం, జగన్నాధపురం మాజీ సర్పంచ్ లు పరపటి రాజశేఖర్ రెడ్డి, పుక్కళ్ళ శ్రీనివాస్ రావు, మాజీ వైస్ ఎంపిపి, మేఘవరం,బోరుభద్ర మాజీ ఎంపీటీసీ లు సూరాడ భీమారావు, వజ్జ ప్రభాకరరావు తో పాటు పలువురు తెలుగుదేశం నాయకులు, మహిళా కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

మురికి నీటితో ఇబ్బందులు పడుతుంటే చర్యలు తీసుకోరా?

విశాలాంధ్ర-పాతపట్నం : మేజర్ పంచాయతీ యశోద నగర్ వీధిలో, రోడ్డుకు ఇరువైపులా ఉన్న కాలువాల నుండి మురికి నీరు, సీసీ రోడ్డు పైకి ప్రవహిస్తోంద ఈ మురికి నీటి వల్ల దుర్గంధం వ్యాప్తి చెందుతూ ప్రజలు నిత్యము ఈ మార్గము నుండి నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు అలాగే ఆ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలు దుర్గంధంతో దోమలతో రోగాల బారిన పడుతున్నారు ఓ పక్క చెడు వాసన భరించలేక, మరోవక్క క్రిమి కీటకాలతో నిత్యము అవస్థలు పడుతు ప్రజలు నివసిస్తున్నారు ఓ పక్క ప్రభుత్వాలు పారిశుధ్యం పై అనేక చర్యలు చేపట్టిన. ఈ పంచాయతీ వారికి మాత్రం.. చీమకుట్టినట్టు కూడా లేదు ఎన్నిసార్లు కంప్లైంట్ చేసిన పట్టించుకున్న నాధుడు లేదు. ఇప్పటికైనా అధికారులు కళ్ళు తెరిచి పారిశుధ్య పనులపై దృష్టిపెట్టి ప్రజలు రోగాలు బారిన పడకుండా జాగ్రత్త.చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుకుంటున్నారు.

ప్రజలకు సక్రమంగా బియ్యం పంపిణీ జరగాలి

విశాలాంధ్ర-జలుమూరు : రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికి నిత్యావసర సరుకుల పంపిణీ విషయంలో డీలర్లు ఎండి ఏం ఆపరేటర్లు నిత్యావసర సరకులను సక్రమంగా పంపిణీ చేయాలని జలుమూరు మండల తాసిల్దార్ వీ సత్యం కోరారు. జలుమూరు మండల రెవెన్యూ కార్యాలయంలో డీలర్లు ఎండిఎం ఆపరేటర్లతో ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వం ప్రజా పంపిణీ ద్వారా నిత్యావసర సరుకులను ప్రజల వద్దకు అందించే కార్యక్రమాన్ని అమలు చేస్తుంది. గ్రామాల్లో నిత్యవసర సరుకులను సక్రమంగా పంపిణీ చేసే బాధ్యత మీపై ఉందని ఆయన వెల్లడించారు. వృద్ధులు వికలాంగులు బియ్యం తీసుకెళ్లలేని కారణంగా వారి ఇంటి వద్దకు వెళ్లి అందించే బాధ్యతలు చేపట్టాలని ఆయన కోరారు. నిత్యవసర సరుకులు పంపిణీ చేసే వాహనం వద్ద సంబంధిత వాలంటీర్లు ఉండి పంపిణీ జరిగే విధంగా చూడాలని ఈ సందర్భంగా తాసిల్దార్ సత్యం వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డిప్యూటీ తాసిల్దార్, సివిల్ సప్లై ఇంచార్జి గణేష్, డీలర్లు ఎండిఎం ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను అచ్చంనాయుడు పరామర్శ

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఇటీవల కాలంలో సంతబొమ్మాళి మండలం తీరప్రాంత గ్రామాలైన పాతమేఘవరంతోపాటు పలుగ్రామాల్లో మృతిచెందిన కుటుంబాలను రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు పరామర్శించారు. మృతి చెందిన వ్యక్తి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అలాగే ఇటీవల అనారోగ్య కారణంగా చికిత్స పొంది, కోలుకునే వ్యక్తులకు పరామర్శించి ఆరోగ్య క్షేమమాచాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతోపాటు పార్లమెంటరీ పార్టీ కార్యదర్శి నౌపడ సత్యనారాయణ, మండల టీడీపీ అధ్యక్షుడు జీరు భీమారావు, మరువాడ సర్పంచ్ ప్రతినిధి సూరాడ దాసురాజు, మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ సూరాడ ధనరాజు, మాజీ సర్పంచులు పరపటి రాజశేఖర్ రెడ్డి, పుక్కళ్ళ శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ సూరాడ భీమారావు, దుపాన రమణారెడ్డి, వజ్జ ప్రభాకరరావుతో పాటు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ రక్తదానం

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : ఫోటో : ఐ.పి.ఎం. 1, వార్డు ప్రజలకు అన్ని సందర్భాల్లో అండగా ఉంటానని మాట ఇచ్చిన 22వ వార్డు కౌన్సిలర్ కాళ్ళ దిలీప్ అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేసి తన మాట నిలుపుకున్నారు. వార్డుకు చెందిన దాలయ్య గత కొంత కాలంగా అనారోగ్యంతో బరంపురం ఎం.కె.సి.జిలో వైద్య సేవలు పొందుతుండగా గురువారం అతన్ని పరామర్శించడానికి వెళ్ళిన కౌన్సిలర్‌కు అక్కడి వైద్యులు రోగికి ఏ-పాజిటివ్ రక్తం అవసరం అని తెలపడంతో తక్షణం స్పందించి, రక్తదానం చేసారు. దాంతో రోగి బంధువులు అతన్ని దాతృత్వాన్ని అభినందించారు.

చీరంజీవిరావు గెలుపునకు కృషి

విశాలాంధ్ర-పోలాకి : ఉత్తరాంధ్ర పట్టభద్రుల అభ్యర్థి డాక్టర్ వేపాడ. చీరంజీవిరావు గెలుపునకు కృషి చేస్తున్నట్లు టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిల్లి వేణుగోపాలస్వామి మండల పార్టీ అధ్యక్షులు మిరియప్పల్లి వెంకట అప్పలనాయుడు అన్నారు. గురువారం పోలాకిలో ఇంటింట ప్రచారం నిర్వహించారు. చిరంజీవి రావు తరుపున ప్రచారం చేయటం జరిగిందిని మొదటి ప్రాథన్యత ఓటు వేసి గెలిపించాసిందిగిగా వారు కోరారు.

మరుపురాని వ్యక్తి ఎర్రన్నాయుడు

విశాలాంధ్ర-పలాస: దేశానికే ఆదర్శనీయుడు, మరుపు రాని వ్యక్తి శ్రీకాకుళం మాజీ ఎం.పి దివంగత కింజరాపు ఎర్రన్నాయుడు అని మాజీ ఎమ్మెల్యే గౌతు శివాజీ అన్నారు. గురువారం పలాస టీడీపీ కార్యాలయంలో ఎర్రన్నాయుడు 66వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రన్నాయుడు నివాళ్ళు అర్పించి అనంతరం శివాజీ మాట్లాడుతూ ఉద్దాన ప్రజల దాహార్తీ తీర్చడానికి కేంద్ర గ్రామీణ ఉపాధి మంత్రి హెూదాలో ఉద్దాన మంచినీటి పథకానికి శ్రీకారం చుట్టి ఉద్దాన ప్రజలకు భగీరధుడు అయ్యారని, ఎన్నో మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించారని, దేశ రాజకీయాల్లో తనకంటు ప్రత్యేక గుర్తింపు పొందారని అన్నారు. దేశంలో శ్రీకాకుళం యాస భాషతో శ్రీకాకుళంనకు వన్నెతెచ్చిన వ్యక్తి ఎర్రన్నాయుడు అని అన్నారు. ఎర్రన్నాయుడుతో తనకున్న సంబంధాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి వజ్జ బాబూరావు, లొడగల కామేష్, విఠల్, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, గాలి కృష్ణ, జి.కె.నాయుడు, అంబటి కృష్ణమూర్తి, సూర్యనారాయణ, చక్రధర్, అప్పారావు, కొవ్వూరు సురేష్, తమ్మినాన ధనుంజయ, చంద్రరావు, సత్యంలు పాల్గొన్నారు.

మందసలో : శ్రీకాకుళం మాజీ ఎం.పి, దివంగత నేత కింజరాపు ఎర్రన్నాయుడు ఆశయాలను ప్రతి ఒక్క టీడీపీ నాయకులు కొనసాగించాలని మందస టీడీపీ నాయకులు అన్నారు. గురువారం మండలం హరిపురం టీడీపీ కార్యాలయంలో మాజీ ఎం.పి దివంగత నేత కింజరాపు ఎర్రన్నాయుడు 66వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

పోలాకిలో : దేశ రాజకీయాలలో తనకంటూ ప్రత్యేకత చాటుకున్న మాజీ కేంద్రమంత్రి కింజరాపు ఎర్రం నాయుడు ఆదర్శనీయులని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిల్లి

వేణుగోపాల స్వామి మండల పార్టీ అధ్యక్షులు మిరియప్పల్లి వెంకట అప్పలనాయుడు అన్నారు.గురువారం మండలం లో గల చెల్లయివలస గ్రామంలో కీర్తి శేషులు స్వర్గీయ కింజరాపు. ఎర్రంనాయుడు జయంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ఆధ్వర్యంలో చెల్లయివలస గ్రామంలో జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల జిల్లా రైతు కమిటీ కార్యదర్శి లూకాలపు రాంబాబు,, గొర్లె. ఎర్రయ్య, బోర. శ్రీను, యశోదమ్మ, అప్పోజీ రామారావు కూర్మారావు, కృష్ణ, గ్రాముస్తులు పాల్గొన్నారు.

పాతపట్నంలో : కేంద్ర మాజీ మంత్రి, కీర్తిశేషులు కింజరాపు ఎర్రన్నాయుడు చిరస్మరణీయుడని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని టిడిపి సీనియర్ నాయకులు మామిడి గోవిందరావు అన్నారు.గ"రువారం ఆయన 66వ జయంతిని నిమ్మాడలో ఎర్రన్న ఘాట్ వద్ద జయంతి వేడుకలలో కింజరాపు కుటుంబ సభ్యులతో ఎంజీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంజీఆర్ మాట్లాడుతూ ఎర్రన్నాయుడు నిత్య శ్రమజీవని,ఆయన జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేశారని అన్నారు. మనం ఆయన అడుగుజాడల్లోనే పయనించి నిత్యం ప్రజా సేవకే అంకితం కావాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలు,అభిమానులు, గెలుపు,ఓటమిలను సమానంగా చూసుకొని నిరాశ నిస్పృహలకు లోనవకుండా మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగాలని హితవు పలికారు.అదే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళులని అన్నారు.అనంతరం ఎర్రన్న ఘాట్ వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విపత్తు సమయంలో అందరి సహకారం అవసరం

ఆర్డీవో శాంతి వెల్లడి

విశాలాంధ్ర-పొందూరు : విపత్తుల సమయంలో ప్రాణ నష్టం జరుగకుండా అందరి సహకారం అవసరమని రెవెన్యూ డివిజనల్ అధికారి బి.శాంతి వెల్లడించారు. పరిశ్రమల్లో ప్రమాదాలపై అవగాహన కోసం చిలకపాలెంలోని నాగార్జున అగ్రికెం లిమిటెడ్ (ఎన్ఏసిఎల్)లో గురువారం క్లోరిన్ గ్యాస్ లీకేజీ అయితే తీసుకోవాల్సిన చర్యలపై పొందూరు మండలం కేశవదాసుపురం, ఎచ్చెర్ల మండలం అరినామ అక్కివలస గ్రామ ప్రజలను అప్రమత్తంపై మాక్ డ్రిల్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దురదృష్టవశాత్తు విపత్తు సంభవించినపుడు ఎలాగైతే స్పందిస్తారో అలాగే మాక్ డ్రిల్ నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం నిర్వహించిన సమావేశానికి పరిశ్రమల శాఖ సేఫ్టీ అధికారి సత్యనారాయణ అధ్యక్షత వహించగా ఎన్ ఎ సి ఎల్ ఉపాధ్యక్షులు శేషగిరిరావు మాట్లాడుతూ మాక్ డ్రిల్ చేయడం వలన జిల్లా లో జరగబోయే ప్రమాదాలపట్ల అవగాహన కల్పించడమైన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లా అగ్నిమాపక అధికారి వీరభద్రరావు మాట్లాడుతూ ఎన్ ఎఫ్ సియల్ నుండి సమాచారం వచ్చిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని తదుపరి చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఏదైనా ప్రమాదం జరిగితే అందరూ తమవంతు సహాయ సహకారాలు అందించి ప్రాణ నష్టం నివారణకు జరుగకుండా సహకరించాలని కోరారు. పరిశ్రమలో క్లోరిన్ గ్యాస్ విడుదలైన వెంటనే సైరన్ మ్రోగగానే కంపెనీలో పనిచేస్తున్న సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఎన్ఏసిఎల్ లో ప్రమాదం జరిగిన తక్షణమే జిల్లా అధికార యంత్రాంగం సమాచారం తెలుసుకొని రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖ, పరిశ్రమల శాఖలు, వైద్య ఆరోగ్య శాఖ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఎన్.డి.ఆర్.ఎఫ్. తదితరమైన శాఖలను సమాయత్తం చేసి ప్రమాదం జరిగిన ప్రదేశంనకు ఆయా శాఖలు చేరుకొని సహాయక చర్యలు చేపట్టేవిధంగా ప్రాక్టికల్ తీరునుచేసి చూపించారు. అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలు అదుపులోకి తీసుకువచ్చేందుకు తమ వంతు పాత్ర పోషించారు. సంఘటనలో క్షతగాత్రులను వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రథమ చికిత్స చేసి అక్కడ నుండి కొంత మందిని అంబులెన్స్ లపై మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆసుపత్రికి తరలించే చర్యలు చేపట్టే తీరును స్పష్టంగా చేసి చూపించారు . క్లోరిన్ గ్యాస్ వ్యాపించకుండా అగ్నిమాపక శాఖ నీరు స్ప్రిట్టింగ్ చేసి ప్రమాద ప్రాంతాన్ని అదుపులోకి తీసుకొనే విధానాన్ని క్షుణ్ణంగా చూపించే తీరును అందరికీ అర్థమయ్యే పరిస్థితి కనిపించింది.కేశవదాసుపురం

గ్రామంలో ఎన్ఎసియల్ సిబ్బంది ఆటోపై క్లోరిన్ గ్యాస్ వ్యాప్తిపై ప్రచారం చేసి గ్రామ ప్రజలను అప్రమత్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ మహేంద్ర, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శంకర్ నాయక్, అగ్నిమాపక శాఖ అధికారి వీరభద్రరావు, ఎన్.డి.ఆర్.ఎఫ్., పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఉమామహేశ్వరరావు, మున్సిపల్ కార్పొరేషన్ నుండి డిఈ రమణ మూర్తి, జాతీయ విపత్తుల నిర్వహణ శాఖ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వి. రాము, వైద్య ఆరోగ్య శాఖ నుండి మెడికల్ ఆఫీసర్ అప్పారావు, రవాణా శాఖ ఎంవిఐ గంగాధర్, ఎన్ఎసియల్ ఉపాధ్యక్షులు కె. శేషగిరిరావు, జనరల్ మేనేజర్ కె. శ్యాం ప్రసాద్, డిజియం పిఎస్ వివిఎస్ ఎన్ వర్మ, సేఫ్టీ మేనేజర్ వెంకటరాజు, పరిశ్రమలో వివిధ విభాగాలకు చెందిన అధిపతులు, గ్రామ పెద్దలు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు, వైద్య సిబ్బంది, యన్.డి.ఎం.ఎ. వాలంటీర్లు, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శన

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని బెజ్జిపుట్టుగ గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చక్ర పెరుమాళ్ళ స్వామి వారి డోలోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో భాగంగా స్వామివారికి వేకువ జాము నుండి ప్రత్యేక అలంకరణ చేపట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మొదటి రోజు ఉత్సవదారుడు పివీఎస్ రాంబాబు ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన కర్నూలు జిల్లా తాడికొండ వాస్త వ్యులు సాయిరాం భాగవతార్‌చే హరికథా గానం అద్యంతం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. అనంతరం ఇచ్ఛాపురంకు చెందిన శ్రీ మణికంఠ మ్యూజికల్ ఈవెంట్ వారి ఆధ్వర్యంలో ట్రాక్ సాంగ్స్, లిటిల్ హార్ట్స్ నృత్య ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. అనంతరం నృత్య ప్రదర్శన చేపట్టిన చిన్నారులకు ఆలయ ధర్మకర్తలు పొందల కృష్ణా రావు, పివీఎస్ రాంబాబు గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

మాజీ ఎమ్మెల్యే సంతాపం



విశాలాంధ్ర-మందస : మండలం వీరభద్ర గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు మామిడి తాతారావు తండ్రి మామిడి గవరయ్య ఇటీవల చనిపోయారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గౌతు శివాజీ గురువారం మృతుని ఇంటికి వెళ్లి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతోపాటు జి.కె.నాయుడు, భావన దుర్యోధన, ఎం.నవీన్‌కుమార్‌లు ఉన్నారు.

సిసి రోడ్ నిర్మాణ పనులు ప్రారంభించిన ఎంపీటీసీ

విశాలాంధ్ర-పాతపట్నం : మండల పరిషత్ నిధులతో కొరసవాడ గ్రామము రెడ్డికి వీధిలో సీసీ రోడ్డు నిర్మాణము కార్యక్రమంలో కొరసవాడ ఎంపీటీసీ సుగుణ కుమారి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాతయ్య మాస్టారు వార్డ్ మెంబర్ దాము లోకేష్ మరియు లక్ష్మీనారాయణ వైఎస్ఆర్సిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

దువ్వాడ వెంటే మేముంటాం

విశాలాంధ్ర సంతబొమ్మాళి : ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసరావు వెంటే మేముంటామని సంతబొమ్మాళి మండలం వడ్డీ తాండ్ర గ్రామానికి చెందిన పలువురు అన్నారు. కాకరాపల్లి పవర్ ప్లాంట్ పోరాట ఉద్యమంలో మాతోనే ఉంటూ, మాతోనే జైలుకు వచ్చారని, అటువంటి దువ్వాడ శ్రీనును మేము విడిచి పెట్టేది లేదని వడ్డీ తాండ్ర మాజీ సర్పంచ్ అనంత హనుమరావుతో పాటు మత్యకార కార్యకర్తలు అన్నారు. ఇటీవల మా గ్రామంలో నిర్మిస్తున్న శ్రీజగన్నాథ స్వామి ఆలయం పునర్నిర్మాణము కొరకు అచ్చం నాయుడు ఆర్థిక సహాయం చేస్తామని చెప్పడంతో వెళ్లామని, మేము ఎప్పుడు వైయస్సార్ పార్టీలోనే ఉంటామని వారు ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ వద్ద స్పష్టం చేసినట్లు హనురావుతో పాటు పలువురు కార్యకర్తలు తెలిపారు. ఈసందర్భంగా దువ్వాడ శ్రీనివాసరావును కలిసినవారికి వైకాపా పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీతోనే చివరివరకు ఉంటూ, మీకు సేవలు అందిస్తానని అన్నారు. మీకు కష్ట కాలంలో ఏ నాయకులు మీ వెంట లేకపోయినా, నేను మీ వెంట ఉండి మీతో పవర్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా పోరాటం చేసానని దువ్వాడ గుర్తు చేశారు. మీకు ఎటువంటి సమస్యలు వచ్చిన నేను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు జెడ్పిటిసి పాల వసంతరెడ్డి, ఎంపీపీ యం. రాజేశ్వరి అప్పారావు, పిఎసిఎస్ చైర్మన్ కెళ్ళి జగన్ నాయకులు (గోవిందరావు) మండల వైస్ ఎంపీపీ ప్రతినిధులు పొందల రామకృష్ణ, నక్క భీమారావు, మండల సచివాలయ కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు మోడీ భాస్కర్ రెడ్డి, మండల వైకాపా పార్టీ కన్వీనర్ కోత సతీష్ తోపాటు వైకాపా నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు దూబ వేణుగోపాల్ రాజ్, కళింగపట్నం లక్ష్మీ అప్పారావు ఉన్నారు.

సరైన బోధన వ్యూహాలను అనుసరించాలి



వీసీ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు

విశాలాంధ్ర - ఎచ్చర్ల : సరైన బోధన వ్యూహాలను అనుసరించడంతోని ప్రయోజనం ఉంటుందని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ నిమ్మ వెంకట్రావు తెలిపారు. వర్సిటీలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో భాగంగా రెండో రోజైన గురువారం ఆయన మాట్లాడారు మారుతున్న అవసరాలకు అనుగుణం గా బోధనలో మార్పులు చేయాలన్నారు. విద్యార్థుల స్థాయి, కుటుంబ నేపథ్యం, వారి అభిరుచులు, గమనించి బోధన సాగాలన్నారు. వర్క్ షాపులు, సదస్సులు అవగాహన కార్యక్రమాల, వల్ల బోధన సిబ్బంది విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు అన్నారు. స్టేట్ రిసోర్స్ సెంటర్ (హైదరాబాద్) మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్ పద్మనాభయ్య మాట్లాడుతూ అధ్యాపకులు నిరంతర విద్యార్థులుగా ఉండి కొత్త విషయాలు తెలుసుకోవాలన్నారు. విద్యార్థులను ప్రభావితం చేసేలా బోధన సాగించాలన్నారు. ఎన్‌సిటీ ఈ (న్యూఢిల్లీ) సభ్యుడు ప్రొఫెసర్ గంటా రమేష్ మాట్లాడుతూ బోధనా నైపుణ్యాలతోనే విద్యార్థులను ఆకట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్టర్ ప్రొఫెసర్ సిహెచ్ ఏ రాజేంద్రప్రసాద్, వర్సిటీ ప్రిన్సిపాల్స్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, డాక్టర్ ఎస్ ఉదయభాస్కర్ సి డి సి డి ప్రొఫెసర్ పీలా సుజాత తదితరులు పాల్గొన్నారు

వై.సి.పి నాయకులకు జిల్లా పదవులు

- ప్రచార కన్వీనర్‌గా ఆదిరెడ్డి - క్రిస్టియన్ సెల్ కన్వీనర్‌గా అన్వేష్



విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : వై.సి.పి పార్టీ ప్రస్థానంలో తమ వంతు పాత్రలు పోషిస్తూ పార్టీ పట్ల అంకిత భావం కనబర్చిన స్థానిక పార్టీ కేడర్‌కు జిల్లా స్థాయి పదవులు వరించాయి. జిల్లా పార్టీ ప్రచార విభాగం కన్వీనర్‌గా తాడి ఆదిరెడ్డి, క్రిస్టియన్ సెల్ కన్వీనర్‌గా ప్రత్తి అన్వేష్‌లను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన జారీ చేసింది. 20వ వార్డు కౌన్సిలర్‌గా, పార్టీ నియోజకవర్గ వాణిజ్య విభాగం కన్వీనర్‌గా ఉన్న ఆదిరెడ్డిని పార్టీ అనుబంధ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షునిగా, స్థానిక ఆంధ్రా బాప్టిస్ట్ చర్చి యువజన విభాగం అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్‌ను జిల్లా క్రిస్టియన్ సెల్ కన్వీనర్‌గా నియమించడం పట్ల స్థానిక పార్టీ కేడర్ హర్షం వ్యక్తం చేసింది. పార్టీ కార్యక్రమాల్లో తమ వంతు పాత్రలు పోషించినందుకు తగిన గుర్తింపు దక్కిందని, పార్టీ నిర్దేశాల మేరకు తమ బాధ్యతలు నెరవేరుస్తామని ఈ సందర్భంగా వారు అన్నారు. జిల్లా స్థాయి పదవులకు ఎంపిక చేసినందుకు పార్టీ అధినేత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డితో పాటు, జిల్లాకు చెందిన మంత్రు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, స్పీకర్ తమ్మినేని సీతారాం, జిల్లా పార్టీ అధ్యక్షులు ధర్మాన క్రిష్ణదాసు, జెడ్పీ ఛెయిర్‌పర్సన్ పిరియా విజయ, నియోజకవర్గ కన్వీనర్ సాయిరాజ్, మున్సిపల్ ఛెయిర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

రికార్డుల నిర్వహణపై పీడీ అసంతృప్తి

విశాలాంధ్ర-జలుమూరు : అంగన్వాడీ కేంద్రంలో రికార్డుల నిర్వహణ సరిగా లేకపోవడంపై ఐసీడీఎస్ పీడీ అనంతలక్ష్మి అసంతృప్తి వ్యక్తం చేశారు. లింగాలవలస అంగన్వాడీ కేంద్రాన్ని గురువారం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని.. పిల్లలు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలన్నారు. రక్తహీనతతో బాధపడుతున్న పిల్లలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేయాలన్నారు.

గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ వేసిన పూడి

విశాలాంధ్ర-కవిటి : ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్స్ ఎంఎల్సీ నియోజకవర్గం నుంచి పూడి కిరణ్ కుమార్ ఇండిపెండెంట్ గా గురువారం విశాఖ కలెక్టరు కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు.విశాఖపట్నంలో కలెక్టర్ ఆఫీసులో ఏ.ఈ.ఆర్.వో శ్రీనివాస మూర్తి కి ఉత్తరాంధ్ర జిల్లాల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలిపిస్తే శాసనమండలిలో ప్రజల గొంతు నవుతానని అన్నారు.ఉద్దానం అభివృద్ధికి కృషి చేస్తానని, కొబ్బరి పరిశ్రమలు తెచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆంధ్ర యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్స్ మల్లికార్జున్, ధర్మారావు,సత్యనారాయణ, రాజశేఖర్, షణ్ముఖరావు పాల్గొన్నారు.